



"నాలుగొందల గజాలయినా వుండాలండీ" అన్నాను.

"చాలా?" మావారు నవ్వుతూ అన్నారు.

మావారు అన్నతీరులోను ఆనవ్వులోనూ నాకు నానా అర్థాలు గోచరించాయి.

"ఎందుకానవ్వు?" అన్నాను.

"నవ్వటం కూడా తప్పే?" ఆశ్చర్యం నటిస్తూ అన్నారు.

"నవ్వటం తప్పుకాదు. నవ్వటానికి సందర్భం వుండాలి.

"నీవలా మూతి ముడుచుకుంటే నామటుకు నాకు, అనలే కోతి ఆపై కల్లుతాగింది నిప్పుతొక్కింది లావుందోయ్ నావని."

వారలా తన్నుతాను కోతితో పోల్చుకుని అలా అనే సరికి నాకు నవ్వువచ్చింది. పైకేనవ్వేశాను.

"హమ్మయ్య యిప్పుడు వాతావణం చల్లబడింది".

వారలా మండుటెండలోంని నడిచివచ్చి ఎ.సి. రూమ్‌లో దూరిన విధంగా పోజుపెట్టి మాట్లాడు తుంటే ఇదే సమయం అని అసలు విషయం చల్లచల్లగా వివరించాను.

నేనుకాపురానికి వచ్చి పాతికేళ్ళు అయింది. ఈపాతి కేళ్ళలో మాకంటూ ఓ సొంత కొంపలేదు సరికదా గజంస్థలం కూడా కొన్న పాపాన పోలేదు.

ఇప్పటికి పదిళ్ళు మారాము. అది మాతప్పుకాదు. ఆ యా యిళ్ళవాళ్ళ తప్పు. సొంత యిల్లు ఉందనే అహం.

"మా చెల్లెలూ వాళ్ళకి ఈవూరు ట్రాన్స్‌ఫర్ అయిందండీ. వాళ్ళకి మా యిల్లు యివ్వాలి వారంలోగా మీరు ఖాళీ చేస్తేబాగుంటుంది."

"మా కోడలు కాపురానికి పైనెలలో వస్తుంది. వాళ్ళు ఆభాగంలోవుంటారు. మీరు ఈనెలాఖరులోగా ఖాళీచేస్తే మంచిది."

"అద్దెకివ్వటంవల్ల మాయిల్లు మాకు సరిపోవటం లేదు. మీరు ఖాళీ చేస్తే ఇల్లంతా వాడు కుంటాము."

అని ఇల్లు ఖాళీ చెయ్యమని తలోవంకతో తలోరకంగా చెప్పారు.

వాళ్ళిల్లు... వాళ్ళిష్టం.

అడుక్కునేవాడికి అరవైఆరు ఇళ్ళన్నట్లు అద్దెకుండే వాళ్ళకీ అంతే. ఈ యిల్లు కాకపోతే మరోయిల్లు. సొంతఇంటివాళ్ళ సంగతి అలాకాదే చూరుపట్టుకుని గబ్బిలంలా అదే ఇంట్లో వేళాడాల్సిందే.

సొంతఇళ్ళ వాళ్ళధర్మమా అని మేమోపది ఇళ్ళు మారాల్సి వచ్చింది. ఇల్లుమారినప్పుడల్లా పోష్టల్‌వారికి, గ్యాస్ వారికి కొత్త అడ్రస్ యివ్వటం. పిల్లలకి స్కూళ్ళు దగ్గర, దూరం. నెల అద్దెరిక్షా మార్చు పనిమనిషిని కొత్తదాన్ని వెతుక్కోటం. కొత్త చోట అలవాటు పడేదాకా యిబ్బందిపడటం. ఎన్నో అనుభవాలతో తలబొప్పి కట్టింది.

"నాకంటూ ఓ సొంతకొంప వుందా?"

ఈ ఆలోచన పురుగులా నా మనసులో ఎప్పుడైతే ప్రవేశించిందో ఆ క్షణంనుంచీ బుర్రని డ్రిల్ చేయటం ఆరంభించింది.

"ఒకయిల్లు కట్టుకునే స్తోమతు మనకి వుంది మనమోసొంత కొంప ఏర్పాటుచేసుకుంటే ఎలా వుంటుందంటారు?" మా వారినడిగాను.

"నీ ఆలోచన భేషుగ్గా వుంది అమ్మడూ! కాకపోతే ఈ వూరిమొత్తం మీద మన కంటూ ఓ గజం స్థలం లేకపోవటమే లోటు," నవ్వుతూ శలవిచ్చారువారు.

"ఓ గజం స్థలమయినా కొనాలన్న ఆలోచన ఈ సరికే మీకు వుండాలి అది మగవాళ్ల డ్యూటీ."

"అఫ్‌కోర్స్, కానీ ప్రతి పురుషుడి వెనుక ఓ స్త్రీ హస్తం వుంటుందన్న నానుడి మర్చిపోకు."

"నాముఖంలా వుంది."

"నీ ముఖానికేమోయ్ దివ్యంగా వుంది."

ఇలా మా మాటలు నవ్వులాటగా జరిగి మధ్యలో చిన్న వార్ కూడా జరిగి చివరికి రాజీకి వచ్చి చిన్నదో పొన్నదో ఓ స్థలంకొందామన్న నిర్ణయానికి వచ్చాము.

నిర్ణయానికి వచ్చి ఏడాది దాటింది. వారు వారి ఫ్రెండ్స్‌కి, తెలిసిన వాళ్ళకి "స్థలం ఎవరైనా అమ్ము తుంటే చెప్పండి నేను కొంటానని చెప్పారు. ఇదే మాట నాకు తెలిసినందరికీ నేనూ చెప్పాను. ఆఖరికి కూర గాయలు అమ్మే బండివాడి మొదలు మా డుంబూని కాన్వెంటుకి తీసుకెళ్ళే నెలసరి రిక్షా అబ్బి వరకూ మాకో స్థలం కావాలని... కొంటామని... ఉంటే చెప్పమని చెప్పాను.

చక్కటి స్థలం మధ్యలో అన్ని వసతులతో కూడిన ముచ్చటైన చిన్న ఇల్లు ఆ ఇంటిచుట్టూతా అందమైన పూల మొక్కలు, కూరగాయ మొక్కలు.

ఊహల్లో మేడలు కట్టేదాన్ని. కాలంమాత్రం కరిగి పోతూనే వుంది. స్థలమేలేనివాళ్ళకి ఇల్లుకూడానా? అన్న నిరాశ నా అణువణువునా ఆక్రమించిన వేళ వక్కవీధిలో వున్న వెంకుమాంబగారితో ఒకరింటికి పేరంటానికి వెళ్ళినప్పుడు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వృద్ధి కూడా అయ్యింది.

రెండు వందల గజాల స్థలం పాతిక వేలు. మొదలు ముప్పై ముప్పై అయిదు వేల వరకు ధర పలుకుతున్నది. స్థలానికి ముఫైవేల వరకే మేము పెట్టదల్చుకున్నాము. నాకేమో పెద్ద స్థలం యిష్టం. చిన్నది ఎవరూ అమ్మటం లేదు పెద్ద స్థలం కొనే స్థోమతు లేదు.

సరిగ్గా ఇలాంటప్పుడే ఏదో మాటల మీద వెంకుమాంబ గారితో స్థలం మాట చెప్పాను. "ఎంత వరకూ పెట్ట గలవ్!" అడిగింది. "ఇరవై నుంచి ముప్పై వరకు." చెప్పాను. "చూద్దాం ఎక్కడో అక్కడ నాకు తెలిసిన వాళ్ళకి చెవుతాను," అంది.

ఆ తర్వాత ఇరువురం ఆ విషయం మర్చి పోయాము. మరో ఆరు నెలలు గడిచి పోయాయి. మేముస్థలం కొనలేదు.

ఈ మధ్య కాలంలో వెంకుమాంబగారింట్లో చాలా అనర్థాలు జరిగాయి. వాళ్ళాయనకి పెరాలిసిస్ వచ్చి తగ్గింది. వాళ్ళ అబ్బాయికి స్కూటర్ యాక్సిడెంట్‌లో కాలు విరిగింది. వాళ్ళమ్మాయికి ఎబార్షన్ అయింది. మరో అబ్బాయికి కడుపులో అల్సర్ ఆపరేషన్ చేయా లన్నారు. గోరుచుట్టు మీద రోకలి పోటులా ఓ రోజు దొంగలు పడి సగం ఇల్లు దోచుకు పోయారు. పట్టుమని పదినిమిషాలు హాయిగా శ్వాస తీసికోటానికి వీలు లేనంతగా ఒకదాని తర్వాత ఒకటిగా వెంకుమాంబగారికి కష్టాలు వచ్చాయి.

ఒకరోజు ఎవరూ లేని సమయంలో నా దగ్గరకు వచ్చి "మాకొచ్చిన ఇబ్బందులు నీకు తెలిసిందే కదా! చాలా చోట్ల అప్పులయ్యాయి. అది తీర్చే మార్గం కనపడటం లేదు. క్రితం ఏడాది నేను కొన్న నాలు గొందల గజాల స్థలమూ అమ్మేస్తున్నాను. నీవు తీసు కుంటావా?" అనడిగింది.

"నాలుగొందల గజాలస్థలం!" నామనసు క్షణకాలం ఆనందంతో తేలియాడింది. అంతలోనే ధర గుర్తుకు రాగా ధర ఎంతో అడక్కుండానే "అంత ధర మేము పెట్టలేము." అనేశాను.

"ఇప్పుడా స్థలం ధర యాభై అయిదు వేలు కాని నేను కొన్నప్పుడు ముప్పైవేలే. అమ్మబోతే అడవి కొన బోతే కొరివి అన్న సామెత నీవు వినేవుంటావమ్మాయ్! నా పని అలాగేవుంది. నీకు మాయింటి పరిస్థితి తెలిసిందే కదా! ఖర్చు మీద ఖర్చు. దాంతో పెద్ద మొత్తం మీద అప్పులయ్యాయి. నిన్న మొన్నటిదాక గుట్టుగా బతికిన దాన్ని పెద్దింటి దాన్ని. అందుకే స్థలం అమ్మేసి ఆ డబ్బుతో అప్పు తీరుద్దామని...."

"నేను అంతధర పెట్టలేను కదా!" మధ్యలోనే కల్పించుకుని నీళ్ళు నములుతూ అన్నాను.

"అదేచెప్పబోతున్నాను. స్థలం బేరం పెడితే ఇప్పటి కిప్పుడు అమ్ముడు బోదు. నాకేమో ఈ వారంలోనే డబ్బు కావాల్సి వచ్చింది. నేను ఆస్థలం మీద పెట్టిన ముప్పై వేలు వస్తే చాలు అన్నట్లుంది నా పరిస్థితి. ఎలాగూ నీవు స్థలం మీద ముఫై వేలు పెట్టగలనన్నావు కదా! ముప్పై పైన మూడు నాలుగు వేలు పెట్టి నాస్థలం తీసుకో. నాలుగొందల గజాల స్థలం నీకు చవకగా అమరుతుంది. నా అప్పులు తీరి నా కష్టాలు గట్టెక్కుతాయి."

వెంకుమాంబగారు చెవుతుంటే నామనసులో ఏమూలో ఆనందంతాండవమాడింది.

"నేను అప్పుల బాధతో చౌకగా స్థలం అమ్ముతున్నానని నలుగురికి తెలిస్తే నా పరువు పోతుందమ్మాయ్! నీ బుద్ధి తెలుసు కాబట్టి అదైనా మీకు స్థలం కావాలన్నారు కాబట్టి అది మీకే అమ్మితే నా అవసరమూ తీరుతుంది మీకు స్థలం అమరుతుందని..."

వెంకుమాంబగారు మాట పూర్తిచేయక ముందే అడ్డు తగిలి "వారినడిగి తప్పకకొంటాను." అన్నాను.

"అబ్బాయి ఆఫీసునుంచి రాగానే అడిగి రేపు ఉదయం ఏసంగతి చెప్పు. చౌకగా అమ్ముతాంటే కొన టానికి ఎవరోఒకరు రాకపోరు. అప్పుల పాలయి స్థలం అమ్ముతున్నారని నలుగురూ అనుకుంటారన్నదే నాబాధ." పైట చెంగుతో కళ్ళు వత్తుకుంటూ అన్నారు వెంకుమాంబగారు.

"మావారితో చెప్పి స్థలం కొనేది లేనిదీ రేపు ఉదయానికి చెవుతాను. ఈవిషయం ఎవరితో చెప్పను." అని మాట యిచ్చాను.

ఆ సాయంత్రం వారు ఆఫీసు నుంచి రాంగానే మాటల మధ్యలో "నాలుగొందల గజాల స్థలంలేనిది ఇంటికేం అందం వస్తుంది! గార్డెన్ ఎలా పెంచుతాము. మామిడి సపోటా నిమ్మ పెద్ద చెట్లుగా పెరగాలంటే ఇంటి చుట్టూ విశాలంగా..." అంటూ మొదలు పెట్టాను.

"తాదూర కంతలేదు మెడకోడేలు అన్న సామెత విన్నావా? అలావుంది నీవు చెప్పేది. చౌకలో దొరికితే నాలుగు వందలేం ఖర్మ నాలుగు వేల గజాల స్థలమే కొనొచ్చు. నిండా మూడువందల గజాల స్థలం కొనలేని మనం...!"

వారు చెవుతుంటే మధ్యలోనే అడ్డు తగిలి వెంకు మాంబగారి స్థలం విషయం చెప్పాను. పనిలో పనిగా ఇలాంటి అవకాశం మళ్ళీ మళ్ళీరాదని కూడా చెప్పాను.

వారు చాలా ఆనందించారు. బాగా బతికిన ఫామిలీ. అభిమానవతి కాబట్టి తన వస్తువు అమ్మటానికి కూడా సిగ్గు పడుతున్నది అని...వెంకుమాంబగారి గురించి ఇరువురం అనుకున్నాము.

ఆమార్నాడు ఉదయానే నేను వెంకుమాంబగారి ఇంటికి వెళ్ళి స్థలం కొంటానని ముప్పై రెండు వేలు తప్ప యివ్వలేమని చెప్పాను.

ఆమె బాధ పడుతూనే వప్పుకుంది. ఈ విషయం ఇప్పుడప్పుడే ఎవరితో చెప్పవద్దంది. కాగితాలు, స్థలము చూసుకోమంది.

కాగితాలు సరీగానే వున్నాయి. స్థలం సలు చదరంగా పెద్ద సైజు మైసూరు పాక్ ముక్కలాగా కనులకింపుగా వుంది. ఉంటే అలాంటి స్థలమే వుండాలి కొంటే అలాంటి స్థలమే కొనాలి అనిపించింది.

ఈ స్థలము అమ్మబడును అని బోర్డ్ కడితే అధికధర ఇచ్చి ఎవరోవకరు కొనకపోరు. మహా అయితే నాలుగు రోజులు అటూ ఇటూగా అమ్ముడయ్యేను. అప్పులయితే అప్పు తీర్చుకోటానికి స్థలం అమ్మొచ్చు. దీనిలో సిగ్గు పడటానికి ఏముంది? వెంకుమాంబ గారి తెలివి తక్కువ తనంకాకపోతే?

ఇతరులకి తెలిస్తే మరో పది వేలు ఎక్కువ యిస్తామని ఆస్థలం కొని ఎగరేసుకు పోవచ్చు. రెండో కంటికి తెలియకుండా నాలుగొందల గజాల స్థలాన్ని యాభైవే లపై ధర పలికేదానికి ముప్పై రెండు వేలు ఇచ్చి కొనేశాము.

నాలుగొందల గజాల స్థలం నాకు ఊహించని విధంగా కారు చౌకగా అమిరింది.

స్థలం కొన్న వారానికి పెద్ద కొడుకు దగ్గర వుండే మా అత్త గారు, ఓ నెల రోజులు ఇక్కడ వుండి పోదామని వచ్చారు.

ఏమాటకామాట మా అత్తగారు అందరిలాంటిదికాదు. చాలా మంది అత్తగార్లకన్నా మంచి ఆవిడ.

నాకు ఇరుగుపొరుగు ఇళ్ళకెళ్ళి కబుర్లాడటం బొత్తిగా చాతగాని విషయం. ఈవిషయంలో మా అత్తగారు నాకో నిక్ నేమ్ కూడా పెట్టారు. "ఇల్లో నారాయణమ్మ" నని...

ఎంత కొత్త వాళ్ళ నైనా సరే అరక్షణంలో పరిచయం చేసుకుని వాళ్ళ గురించి అన్ని విషయాలు తెలుసుకోటం మా అత్తగారికి కొట్టిన పిండి. ఆమెలో వున్న అదో ఆర్ట్ అది.

మా అత్తగారు వచ్చిన రెండు రోజులకే రెండు వీధుల వాళ్ళూ పరిచయం అయ్యారు. "మనింటికి నాలుగో ఇల్లు వెంకటప్పయ్య గారు లేరూ ఆయన మూడో కోడలు భవాని తుర్లపాలెం నల్ల రాముడి పెద్ద కూతురు. బంధుత్వం తిరగేస్తే తెలిసింది." అంటూ మా అత్తగారు ఎవరు ఎవరైనది చెబుతుంటే ఆశ్చర్య పోవటం నావంతయింది.

మా అత్తగారు రాకరాక నాలుగు రోజులు వుందామని వస్తే మావారికి జ్వరం పట్టుకుంది. అది టైఫాయిడ్ అని డాక్టర్ తేల్చటం జరిగింది. దాంతో మా అత్తగారి ప్రయాణం వాయిదా పడింది.

ఎంక్వయిరీ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం యిస్తే మా అత్తగారికి గోల్డ్‌మెడల్ రావటం ఖాయం. వెంకు మాంబ గారి గురించి చాలానే విషయాలు సేకరించారు.

వెంకుమాంబగారు తన వబ్బం గడుపుకోటానికి స్నేహం చేస్తుందని..కమ్మగా కబుర్లు చెవుతుందని..ఆమె ఆమధ్య నాలుగొందల గజాల స్థలం కొందని, ఆ స్థలం అసలు మంచిది కాదని...మొదట చెంచు రామయ్య అనే ఆయనది ఆస్థలం అనీ అది కొన్న నెలకే భార్య పోవటంతో స్థలం మంచిది కాదని కాంతారావనే ఆయనకి కారు చౌకగా అమ్మేశాడట. కొన్న రెండు నెలలకి ఆయన పోవటంతో రాజారావు అనే ఆయనకి దాన్ని అమ్మేసిందిట భార్య. రాజారావు అది కొని ఇల్లు కడదామని శంఖు స్థాపన చేశాడు. రాత్రికి రాత్రి పెద్దకొడుకు కోడలు బస్సు యాక్సిడెంటులో చనిపోయారుట. రాజారావు పదివేలకి వెంకుమాంబగారికి ఆ స్థలం అమ్మారుట

ఆస్థలం కొన్న తర్వాత వెంకుమాంబగారింట్లో ఎన్ని అనర్థకాలు జరగాలో అన్ని అనర్థకాలు జరిగాయట. చావు తప్పి కన్ను లొట్టపోయిన విధంగా ఒక్క మరణం సంభవించలేదుగాని మిగతా అరాచకాలన్నీ వాళ్ళింట్లో జరిగాయిట. 'చౌకగా వచ్చింది కదా అని ఆశపడి ఆ స్థలం కొన్నాను. ఎవరైనా కొనే వాళ్ళుంటే ఎంతకో అంతకి ఆస్థలం అమ్ముతానని' ఎవరితోనో అందిట. పది రూపాయలకి ఇస్తే మాత్రం చూస్తూ చూస్తూ ఆ దిక్కుమాలిన స్థలం ఎవరు కొంటారు! తెలిసిన వాళ్ళెవరూ ఆస్థలాన్ని నాఎత్తు ధనం పోసినా కొనరని..."

మా ఇంటికి మూడో ఇంటి మేడ మీద అద్దెకున్న ఆండాళ్ళమ్మ మా అత్తగారికి చెప్పిందిట. మా అత్తగారు వచ్చి వివరంగా నాకు చెప్పారు.

ఆవార్త వినంగానే నాగుండె గుభేల్ మంది. మా అత్తగారు వచ్చి వారం అయింది. అయినా మేము కొన్న స్థలం గురించి ఆమెకి చెప్పలేదు. ఇది చెప్పకూడని రహస్యమని కాదు. వెంకుమాంబ గారు స్థలం అవసరార్థం అప్పుతీర్చటానికి అమ్మారు. ఆవిషయం నలుగురికీ తెలుస్తుందని సిగ్గు పడ్డారు. మేము కారు చౌకగా కొన్నది గాక అందరికీ ఈవిషయం చెప్పి టాంటాం వెయ్యాలా!

అందుకే స్థలం కొన్నట్లు మేమెవరికీ చెప్పలేదు. మా అత్తగారు తిరిగి ఊరు వెళ్ళిం తరువాత ఇక్కడో స్థలం కొన్నామని లెటర్ రాద్దామనుకున్నాము నేను మావారు. ఎవరితో చెప్పొద్దని చెప్పినా నోరుజారి చెప్పేసే అలవాటు మా అత్తగారికి వుంది. అందుకే ఈవిషయం గోప్యంగా వుంచాను.

జారి పోతున్న గుండెని చిక్కబట్టుకుంటూ "మీరు చెప్పింది నిజమా? స్థలం కొనటానికి రోగాలు రావటానికి సంబంధం ఏమిటి మీదంతా చాదస్తం." అంటూపైకి బుకాయించాను.

"అలా తేలిగ్గా కొట్టి పారేయకు. స్థలం కొనాలంటే స్థల పురాణం సేకరించాలి. ఇల్లు కట్టించింది కొనాలన్నా ఇల్లు కట్టించుకోవాలన్నా వాస్తు చూడాలి." మా అత్తగారు ముక్కుమీద వేలుంచుకుని చెప్పారు.

"స్థలపురాణం అంటే?" నిజంగా నాకు తెలియకనే అడిగాను.

" చెవుతా చెవుతా కొందరిళ్ళకి వెళతాం మనం. ఎంతసేపైనా అక్కడే కూర్చో బుద్ధి అవుతుంది. మరి కొందరిళ్ళకి వెళతాం వాళ్ళు మన మర్యాదకి లోపం ఏమీ చెయ్యరు అయినా సరే మనకెందుకో అక్కడ కూర్చున్నంతసేపూ ముళ్ళ మీద కూర్చున్నట్లు వుంటుంది. ఎప్పుడెప్పుడు వెళ్ళి పోదామా ఇక్కడ నుంచి! అనిపిస్తుంది. కారణం ఏమిటి? ఆ ఇంటి మహాత్యం.

"అలాగే స్థలాలు విషయం కూడా ఖాళీ స్థలం కొందామని వెళతాము. ఒక్కోస్థలం పాలకోవా ముక్క లాగా కనిపిస్తే మరో స్థలం పిశాచాలు నడయాడే నిలయంలాగా కాన వస్తుంది. అంతెందుకు గుడి గోపురాలు లాంటి పవిత్ర మైన చోట స్థలాలు మంచివి. అలాంటి చోట్లకి వెళితే ఎంతసేపైనా కూర్చోబుద్ధి వేస్తుంది. మనసు ప్రశాంతంగా పవిత్రంగా అనిపిస్తుంది.

"బాధల్లో వున్నవాళ్ళు కూడా గుడి ప్రాంగణంలో కూర్చుని మనసునిమ్మళించుకుంటారు. ప్రశాంతత పొందుతారు. దేముడు ఎక్కడ లేడు? సర్వాంతర్యామి ఆ పరమేశ్వరుడు. అయినా చిన్న గుడికెళ్ళినా పెద్ద దేవాలయంకి వెళ్ళినా మనసెందుకో పవిత్రత చెందుతుంది. ఒకదేవాలయం నిర్మించాలి అంటే పూర్వం ఎంతో చూసేవాళ్ళట.

"ఆ రాజు పేరు ఆ కోట పేరు నాకు సరీగాతెలియదుగాని ఈ కధ బహుళ ప్రచారంలో వున్నది. ఆనోట ఆనోట వినగా నాకూ తెలుసు. పూర్వం ఒక రాజు తనోకోట నిర్మించుకోటానికి మంత్రిని తీసుకుని ఎన్నో ప్రదేశాలు తిరిగి చూస్తుండగా ఓ కుందేలు తన ప్రాణం తియ్యటానికి వస్తున్న పులిని చూసి పరుగు తీసిందిట ముందు ప్రాణభయంతో పరుగులు తీసే కుందేలు, దాన్ని వేటాడుతూ తరుముకొస్తున్న పులి.


"ఆరెండూ కొంతదూరం వెళ్ళిం తరువాత..కుందేలు ఓ చోట నిలిచి గిరుక్కున వెనుతిరిగి పులితో పోరు ప్రారంభించింది. ఆ స్థల మహాత్యం అలాంటిది. పిరికి వాళ్ళు కూడా వీరుల్లాగా తయారవుతారు అని అది చూపుతూ మంత్రి చెప్పి రాజుగారి చేతకోటని ఆప్రదేశంలో కటించాడుట. వాస్తు శాస్త్రం స్థలపురాణం రెండూ వున్నాయి సుమా! అంతతేలిగ్గా వాటిని కొట్టి పారేయకు." అంటూ మా అత్తగారు, ఉదాహరణతో సహా స్థల పురాణం కధలా వినిపించారు.

మింగా కక్కలేని పరిస్థితి అయింది నాది. మావారితో చాటుగా ఈ మాట చెపుదామా అంటే వారు టైఫాయిడ్ జ్వరంతో బెడ్ ఎక్కారు. ప్రస్తుతం ఏమీ చెయ్యలేక దిగ మింగి ఊరుకున్నాను.

సరీగ్గా రెండు రోజుల తర్వాత మా అత్తగారు వంటింట్లో జారిపడింది. కాలు విపరీతంగా వాచి పోయింది. ఆమె మంచం ఎక్కారు. డాక్టరు రావటం పరీక్ష చేయటం ఇంట్లోనే జరిగింది. కాలు విరగలేదని బోను తొలగ లేదని మోవుగా దెబ్బ తగలటం వల్ల కాలు బాగా వాచిందని డోంట్ వర్రీ! అని చెప్పి మాత్రలు ఆయింట్‌మెంట్ రాసిచ్చి వెళ్ళాడు.

మా అత్తగారు అసలే గాభరా మనిషి ఇంతొస్తే అంత చేసేరకం. "ఆ డాక్టరుకేమీ తెలియదు నాకాలు విరిగింది. నా బతుకు ఇంక మంచమేను. ఈ జన్మకి ఇంకనేను లేచి తిరగను. పెద్దాడికి టెలిగ్రాంకొట్టు అమ్మాయికి లెటర్ రాయి." అంటూ గోల పెట్టేశారు.

ఫలితం మాబావగారు తోడికోడలు పిల్లలు, పాట్నాలో వున్న చిన్న మరిది ఇద్దరు ఆడబడుచులు వాళ్ళ పిల్లలు మూడో రోజు కల్లా దిగారు. అప్పటికి మా



కొత్తబియ్యం వచ్చే రోజుల్లో బియ్యం మూట కట్టి పదినిముషాలు కుక్కర్‌లో ఆవిరికి పెట్టండి. తర్వాత అన్నం వండిచూడండి. అంటుకోదు.

అత్తగారి కాలి వాపు, తీపు కాస్త తగ్గాయి. అయినా రాకరాక వచ్చిన వాళ్ళు వెంటనే ఎలా వెళతారు! అంతా పదేసి రోజులు శలవు పెట్టి వచ్చిన వాళ్ళే. పెళ్ళి వారిల్లులాగా తయారయింది మా యిల్లు.

రెండు వారాల తర్వాత సగం మంది వెళ్ళారు. మూడోవారంలో మా అత్తగారిని తీసుకొని మా పెద్ద బావగారి ఫేమిలీ వెళ్ళింది. వాళ్ళంతా వెళ్ళిం తరువాత లెక్క చూసుకుంటే, వాళ్ళకు పెట్టిన గుడ్డలు వెచ్చాలు బియ్యం వగైరా ఖర్చులు మూడు వేలు దాటింది.

వారికి పూర్తిగా జ్వరం తగ్గి ఆఫీసుకి వెళ్ళి వస్తున్నారు. వెంకుమాంబగారు కారుచౌకగా ఆస్థలం ఎందుకు అమ్మింది..మా అత్తగారు చెప్పిన స్థల పురాణం...వివరంగా చెప్పి అర్జంట్‌గా ఇంక ఏ అనర్థకాలు జరక్క ముందే ఆస్థలాన్ని ఎంతకో అంతకి అమ్మేయండని మావారికి గట్టిగా చెప్పాశాను.

"అమ్మాకి చాదస్తంవుండటంలో అర్థం వుంది. మునలమ్మలాగా ఈ మూఢ నమ్మకాలు ఏమిటి? నీవు అమ్మ మాటలు పట్టించుకోకు." అంటూ మావారు మెత్త మెత్తగా చివాట్లు వేయబోయారు.

"ఆస్థలం అమ్మకపోతే నన్నుకాదు మీరు చూసేది నా శవాన్నే!" ఘోరంగా శపధం చేశాను. ఆమాత్రం బెదిరింపు లేకపోతే ఈ మగ వాళ్ళు లొంగరు.

స్థలం అమ్మటానికి మా వారు వప్పుకున్నారు.

వెంకుమాంబగారి స్థలం మేము కొన్నట్లు ఈ వీధిలో ఎవరికీ తెలియదు. పైగా ఆస్థలం ఎవరూ కొనరు. ఇంక ఎలా అమ్మటం? ఇలాంటి సమయంలో..

"మీరు స్థలాలు కొన దలిచినా అమ్మ దల్చినా మాతో సంప్రదించండి.' రేవతి బహుమతి వారి ప్రకటన ఓ దిన పత్రిక ప్రచురించింది. చూసి మావారు వాళ్ళ దగ్గరకు వెళ్ళారు. అక్కడ వాళ్ళ వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా వుందిట. స్థలాలు కొంటామని కొందరు అయితే అమ్మమని బోలెడు మందితో కిటకిటలాడుతున్నదిట.

మావారు వాళ్ళకి పాతిక రూపాయల ఫీజు ముందుగా ఇచ్చి స్థలం వివరాలు మా అడ్రస్ ఇచ్చి వచ్చారు.

వారం తిరక్కుండానే వాళ్ళ దగ్గరనుంచి మాకో లెటర్ వచ్చింది. మావారు అక్కడికి బైలుదేరుతుంటే చెప్పాను. అయిదారు వేలు నష్టపోయినా ఫరవాలేదు. ముందా దరిద్రపు స్థలం అమ్మేయండని..."నష్టానికా?" అన్నారు వారు. "డబ్బు నష్టపాయినా ఫరవాలేదు. ప్రాణా నష్టం కలగలేదు సంతోషించండి." మెత్త మెత్తగా వడ్డించాను.

రేవతి బహుమతి ధర్మమా అని మా స్థలం అమ్ముడయింది. పాతికవేలు మించి ఆశించని నేను తెల్లబోయాను, మావారు నాచేతిలో పెట్టిన సలభై ఎనిమిది వేలుచూసి.

"మీ ఆడవాళ్ళు ఏదొచ్చినా పట్టలేరు. స్థలం కొను కొను అని ప్రాణం తీశావు కొనంగానే చౌకగా అమిరిందని సంతోషించాల్సింది పోయి, అమ్మ చాదస్తం మాటలు పట్టుకుని స్థల పురాణం వినిపించావు. స్థలం అమ్మిందాక చెవిలో జోరీగలాగా రొద పెడుతూనే వుంటివి. అమ్మితే పదహారు వేలు లాభం వచ్చింది. పిచ్చి స్థలం అయితే లాభం వస్తుందా? ఒక్క ఏడాది ఆగితే ఆస్థలం రేటు లక్షదాటేది. ఇంతకీ ఆస్థలం ఎవరుకొన్నారో తెలుసా! రేవతి బహుమతి మేనేజరు కొన్నాడు." అంటూ దొరికిందే సందని మెత్త మెత్తగా చివాట్లు పెట్టారు శ్రీవారు.

"మీరు లక్ష చెప్పండి నాకు అనవసరం. ఇప్పుడు నామనసు ప్రశాంతంగా వుంది. ఆస్థలం పోతే ఇంకొకటి..దేశం గొడ్డుపోలేదు. పదహారు వేలు బ్యాంక్‌లో వేయండి. రెండు వేలు కిందటి నెల ఖర్చులకి తీసేద్దాం. ముప్పై వేలకి ఓ స్థలంకొని పెట్టమని రేవతి బహుమతి, మేనేజర్‌కి చెప్పిరండి ఇటు స్థలం అటు లాభము రెండూ అమరుతాయి."

నేను చెప్పింది వారికు నచ్చింది. "గుడ్ అయిడియా!" అంటూ మెచ్చుకుని తర్వాత నాలుగు రోజులు ఆగి రేవతి బహుమతి వారి దగ్గరకు వెళ్ళి వచ్చారు.

"అక్కడ వాళ్ళ ఆఫీసు లేదు. చుట్టు పక్కల ఎవరి నడిగినా ఏమి చెప్పలేదు. రాత్రికి రాత్రి ఆఫీసు ఎత్తేసి మనిషే మాయం అయ్యాడు. చాలా విచిత్రంగా వుందని అందరూ చెప్పుకోటమే. వాళ్ళ బిజినెస్ మూడు పూవులు ఆరు కాయలుగా వుంది. ఏం జరిగిందో తెలియదు. మనుషులు మాయంకావటమే గాక బోర్డ్ కూడా ఎత్తేశారు. కుర్చీలు బల్లలు ఏవీ లేవు చాలా చిత్రంగా వుంది." ఆశ్చర్యం వెలిబుచ్చుతూ వారన్నారు.

"స్థలమహత్యం!" నవ్వుతూ అన్నాను.

మా వారు ముందు తెల్లబోయి ఆ తర్వాత తానూ నవ్వేశారు. వెంకుమాంబగారూ మాకు అమ్మిన స్థలానికి చాలానే కథ వుంది. ఆస్థలం కొన్న వాళ్ళు ఎవరూ బాగు పడలేదు. కాని మా విషయానికే వస్తే స్థలం మీద పదహారు వేల లాభం కూడా వచ్చింది.

మరి ఆస్థలం మంచిదా.. చెడ్డదా?!

ఏమో! ఆదైవానికి తెలియాలి! □